

# సంస్కారం

- కె. వాసవదత్త రమణ

"అమ్మా! ఎలా ఉంది?" ఆత్రంగా అన్నాడు మురళి తల్లికేసి ఆదుర్దాగా చూస్తూ.

హాస్పిటల్లో మంచం మీద పడుకున్న శాంత కొద్దిగా కదిలింది.

"అమ్మా నేను వచ్చేశాను!" పక్కనే కూర్చుని తల నిమురుతూ ఆప్యాయంగా అన్నాడు.

కొడుకు ఎదురుగా కనపడగానే, ఆమె కళ్లు వింత కాంతితో మెరిసాయి. మళ్లీ మగతలోకి జారిపోయింది జ్వరతీవ్రతలో.

తెల్లని కలువ కాడలా అతి నీరసంగా పడుకున్న తల్లిని చూడగానే మురళి మనసులో ఆవేదన ఎగిసింది. అలాగే ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. చిన్నతనపు జ్ఞాపకాలు అతని అలల్లా స్పృశించాయి.

000

"మురళీ! నమస్కారం చేయి!" వీధిలో నడుస్తూంటే పక్కన ఉన్న ఆరేళ్ల మురళితో అంది శాంత.

ఎదురుగా ఉన్న పెద్దాయినకు నమస్కారం చేశాడు.

"దీర్ఘాయుష్మాన్ భవ!" దీవించాడు ఆయన.

"ఏమ్మా శాంతా! బాగున్నావా?" అంటూ పలకరిస్తూ ఆయన ముందుకు సాగిపోయాడు.

గుడికి తీసుకెళ్లి దర్శనం అయ్యాక, మెట్ల దగ్గర బిచ్చగాళ్లందరికి మురళి చేత చిల్లర వేయించింది.

స్కూలుకి వెళ్లగానే, "ఏం శాంతా, ఎలా ఉంది?" తోటి టీచరు అడిగింది.

"బాగానే ఉంది విద్యా!" నవ్వేసింది శాంత.

"శాంత! పుట్టెడు జ్వరంలో కూడా స్కూలు మానవు కదా!"

"ఆ, స్కూలు మానను, గుడికి వెళ్లడం మానదు. శాంతా, నిజంగా నిన్ను చూస్తుంటే చాలా అసూయగా ఉంది. ఆ భగవంతుడు నీకెంత ధైర్యాన్ని ఇచ్చాడో! భర్త పోయినా, చాలీచాలని ఈ జీతాలలో అవస్థ పడుతున్నా, ధైర్యంగా, బతుకును లాక్కొస్తున్నావు?" తోటి టీచరు లక్ష్మి ప్రశంసాపూర్వకంగా అంది.

బదులుగా చిన్నగా నవ్వింది శాంత.

మురళికి కొద్దికొద్దిగా అర్థమయీ అర్థమవనట్టుగా ఉన్నాయి, వాళ్ల మాటలు. అయినా తన తల్లి చాలా గొప్పదన్న భావం అతని మనసులో బలంగా నాటుకుపోయింది, చిన్నప్పట్నుంచి.

పెద్దవాళ్లను గౌరవించడం, సంప్రదాయాన్ని పాటించడం, క్రమశిక్షణగా జీవితం గడపడం, మంచితనం, దయ పెంచుకోవడం-ఇలా అన్ని సుగుణాలనూ తల్లి పెంపకంలో లక్షణంగా నేర్చుకుంటూ, తన్ని తాను తీర్చిదిద్దుకున్నాడు మురళి.

000

ఇంజినీరింగు పూర్తయి మురళి బొంబాయిలో ఉద్యోగంలో చేరేటప్పటికి, ఉన్న సొంత ఇల్లు కాస్తా అమ్ముకోవాల్సివచ్చింది శాంతకి. భర్త మరణం తర్వాత ఆమెను అమితంగా బాధించిన విషయం అదొక్కటే!

తల్లి పైకి చెప్పుకోలేకపోయినా ఆమె బాధను గ్రహించి, లోలోపల మథనపడ్డాడు మురళి.

"అమ్మా, బొంబాయి వెళ్లిపోదాం. ఇంకా ఇక్కడే ఎందుకు?" మురళి ఉద్యోగం రాగానే చాలా బతిమాలాడు తల్లిని,

"మురళీ, ఈ ఊరు వదిలిపెట్టి రాలేనురా! ఇది నా పుట్టినిల్లు, మెట్టినిల్లు కూడా. నాన్నా, ఏమనుకోకు" నిబ్బరంగా అంది శాంత.

ఓ నిర్ణయానికి వచ్చిన తల్లి, ఎంత చెప్పినా వెనుదిరగదని మురళికి బాగా తెలుసు. అందుకే ఆమెతో తర్కించలేదు.

000

మురళి ఎదుగుదల శాంతకి ఎంతో ఆనందాన్నిచ్చినా, అతను బొంబాయి పోవడంతో, అతని చుట్టూ ఇన్నాళ్లూ తిరిగిన ఆమె జీవితం, హఠాత్తుగా స్తబ్ధుగా అయిపోయింది. స్కూలు నుంచి రాగానే మురళి జ్ఞాపకాలు ఆమెను బాధపెట్టసాగాయి.

స్కూలు సెలవుల్లో మురళితో బొంబాయి వెళ్లిపోయింది అతని గొడవ పడలేక. బొంబాయి నగరంలో మురళి జీవితం గొప్పగా ఉండటం చూసి చాలా ఉప్పొంగిపోయింది శాంత. మురళి కూడా తల్లిని ఒప్పించి, తనతో పాటే ఉంచుకుని ఆమెను బాగా సుఖపెట్టాలని, బలంగా అనుకున్నాడు.

"అమ్మా! నీలూ, అరవవాళ్లయినా తెలుగు బాగా మాట్లాడుతుంది" మురళి పరిచయం చేశాడు ఓ రోజు సాయంత్రం.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-
ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో
సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

'ఇంత సన్నగా నాజూగ్గా ఉండే ఈ అమ్మాయి' అనుకుంది శాంత మనసులో.

కాని ఓ అరగంట మాట్లాడేటప్పటికి "ఆ అమ్మాయి మనస్సు ఎంత దృఢమైంది-అనుకుని ఆశ్చర్య పోయింది

"అమ్మా! నీలూ ఎలా ఉంది?" రాత్రి పడుకునే ముందు తల్లి పక్కగా చేరి అడిగాడు మురళి, చిన్నగా.

బలంగా, అందంగా, ఎత్తుగా ఉన్న మురళి, ఆ క్షణాన ఆమెకు చిన్న పిల్లాడిలా కనిపించాడు.

ఆమెకు తెలియకుండానే అతన్ని అప్రయత్నంగా దగ్గరకు తీసుకొని వాత్సల్యంగా తల నిమిరింది. "మురళీ, నీలూ నీకు తగిన జోడీ. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోరా!"

ఆశ్చర్యపోతూ చిన్నగా, సిగ్గుగా నవ్వాడు మురళి. "అమ్మా! గ్రహించావే!"

"నువ్వు నా శరీరంలో భాగానివే కాదు, నా మనసువి కూడా మురళీ!"

"అమ్మా!"

"నువ్వు అక్కడ స్పందిస్తే, అది ఇక్కడ తెలుస్తుంది" అంది నవ్వుతూ, తన గుండె వైపు వేలు పెట్టి చూపుతూ.

"అమ్మా!" ఆర్ద్రంగా అన్నాడు మురళి.

బొంబాయిలో అత్యంతవైభవంగా మురళి పెళ్లి జరిగింది. శాంత ఆనందానికి అవధులు లేవు.

పెళ్లయిన పదోరోజుకి శాంత ప్రయాణం అవడం చూసి మురళి గట్టిగా ప్రతిఘటించాడు.

"అంతా నీ ఇష్టమేనా? నేనేం పంపను. నువ్వెళ్లి ఆ ఊళ్లో చేసేదేముంది? ఇక్కడే నాదగ్గరే ఉండిపో! ఉద్యోగం రిజైన్ చేసేయి!" కోపంగా అన్నాడు.

"మురళీ, నన్ను బలవంతం చేయకు. ఆ ఊళ్లో నువ్వు నా దగ్గర లేవన్న బాధ తప్పించి, నాకింకేం ఇబ్బంది ఉండదు. రెక్కలు వచ్చిన పక్షివి నువ్వు. స్వేచ్ఛగా నీ ఇష్టం వచ్చినట్టు హాయిగా బతుకు. నువ్వు దగ్గరే ఉండాలన్న స్వార్థం నాకే కోశానా లేదు. నీ సౌఖ్యం ఎక్కడుంటే అక్కడ ఉండిపో! నా గురించి ఆలోచించి, అనవసరంగా ఆందోళన పడకు. నేనా ఊరు వదిలి ఉండలేను మురళీ!"

మురళి బాధపడ్డాడు.

కాని నీలూ ఊరుకోలేదు. "ఆంటీ! నేను అస్సలు ఒప్పుకోను. మీరూ మాతోనే ఉండాలి. మీకు అక్కడ ఎవరున్నారు చెప్పండి. ఇల్లు కూడా లేదు, ఎక్కడుంటారు?" గట్టిగా పట్టుపట్టేసింది వెళ్లొద్దంటూ

"అమ్మా! నన్ను బలవంతం చేయకు. నేను ఈ పట్నంలో, ఈ అపార్టుమెంటుల్లో స్వేచ్ఛగా ఉండలేను. ఈ జనం, ఈ గందరగోళాలు, ఈ పరుగులు ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి."

మురళి ఇక తర్కించలేదు. నీలూ, శాంతకి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూంటే ఆమెను వద్దని వారించాడు.

"అమ్మా, నీ ఇష్టం! వెళిపోదువు కాని, ఒక్క నెల రోజులాగు. నేను, నీలూ స్వయంగా వచ్చి నిన్ను దింపి తిరిగివస్తాం, సరేనా?" అర్థింపుగా అన్నాడు.

"మురళీ, నా కోసం బాధపడకు అక్కడ నాకేం ఇబ్బంది ఉండదు. అక్కడున్నవాళ్లందరూ నా వాళ్లే. పచ్చటి పర్వతాల మధ్య ఉన్న వేణుగోపాలస్వామి నా దేముడు. ఆ ప్రకృతిని, నా ఊరిని వదిలి నేను ఎక్కడా ఉండలేను. ఉండలేకపోతున్నాను.

తన తల్లి మూలాలు అన్నీ ఆ ఊళ్లోనే ఉన్నాయి. అర్థంచేసుకున్న మురళి తల్లి నిర్ణయానికి ఇక ఎదురు చెప్పలేదు.

000

స్టేషను నుంచి ఊళ్లోకి వెళుతూంటే శాంత ముఖం వెలిగిపోయింది. తన కొడుకు, కోడలులో ఇంటి ముందు దిగుతూ తెల్లబోయింది.

"మురళీ! ఇదేమిట్రా? ఇది మనం అమ్మేసిన ఇల్లు కదా!"

"అమ్మా! ఇప్పుడు ఇది మళ్లీ మన ఇల్లే!" మురళి నవ్వుతూ అన్నాడు.

శాంత అయోమయంగా చూసింది.

మురళి సామాన్లు లోపల పెడుతూ, "అమ్మా! మన పరిస్థితి బాగోలేక అమ్మేసిన ఇంటిని మళ్లీ కొనేశానమ్మా! నువ్వెలాగూ నాతో ఉండమంటే ఉండనంటున్నావు. మన జ్ఞాపకాలలో నిండి ఉన్న ఇంట్లో నువ్వుంటే నాకు తృప్తిగా ఉంటుంది."

"మురళీ, అంత డబ్బు పోసి మళ్లీ కొన్నావా?"

"అమ్మా, అసలు ఉద్యోగం రాగానే ఈ పని చేయాల్సింది కాని అలా చేస్తే నువ్వు ఎప్పటికి నా దగ్గరకు రావన్న నా స్వార్థమే నన్ను ఆ పని చేయనివ్వలేదు. కాని నీ నిర్ణయానికి తిరుగులేదని అర్థం అయ్యాక, నీకు చెప్పకుండా నేను చేసిన మొదటి పని ఇదేనమ్మా!"

"మురళీ!" భావోద్వేగంతో శాంతకు మాటలు రాలేదు.

"ఆంటీ! చాలా సర్‌ప్రైజ్ అయ్యారు కదూ?" నీలూ నవ్వింది.

"నీలూ! ఇది మురళి ఎప్పుడు చదువుకునే చోటు. ఇది మా అత్తగారి మంచం ఉండే చోటు, అదిగో ఆ జామచెట్టు చూశావు, మా మావగారు రావులపాలెం నుంచి తెప్పించి వేశారు. ఆ మల్లెతీగ ఎప్పుడు విరగపూస్తుంది, వేసవిలో. ఇదిగో నీలూ! ఈ బావి చూశావా, నా పెళ్లయిన కొత్తలో కొంచెం వంగితే చేతికే నీళ్లు తగిలేవి!"

శాంత గలగలలాడుతూ, కోడలికి ఇల్లంతా పొంగిపోతూ చూపిస్తూంటే, మురళికి, తల్లి వయసు సగానికి తగ్గిపోయిందని పించింది.

"వృక్షాన్ని పెకలించి ఇంకో చోట నాటుదామని ప్రయత్నం చేశాను! కాని అది వృక్షం, మొక్క కాదని త్వరగానే తెలుసుకున్నాను, వేరు ఎండిపోకుండానే!" మనసులో అనుకున్నాడు.

ఊళ్లోవాళ్లందరినీ పిలిచి సత్యనారాయణవ్రతం చేయించింది శాంత, మురళి, నీలూలతో. కొడుకు, కోడలితో కళకళలాడుతున్న సొంతింటిని చూసుకుంటూంటే, ఆనందంతో ఆమె మనసు మూగపోయింది.

"మురళీ, హాయిగా వెళ్లి రండి! నా గురించి దిగులేం పెట్టుకోకు ఫోన్లు చేస్తూనే ఉంటునుగా!" శాంత కన్నీళ్లలో సాగనంపింది ఇద్దరినీ.

000

మురళికి కొడుకు పుట్టగానే శాంత ఆనందాన్ని ఎవ్వరూ పట్టలేకపోయారు. ఊరంతా పిలిచి మిఠాయిలు పంచింది. మనవడికి 'అనురాగ్' అని పేరు పెట్టించి పెద్దగా ఖర్చు చేసింది.

మురళి వాళ్లు రావడం, లేదా శాంత అక్కడికి వెళ్లడం ఇలా ఆరేళ్లు తెలియకుండానే గడిచిపోయాయి. నీలూకి ఉద్యోగ బాధ్యతలు ఎక్కువై, పిల్లాణ్ని నెమ్మదిగా తన తల్లిదండ్రుల దగ్గర వదిలేసింది.

'నీలూ! మీ ఇంట్లో కల్చర్ వేరుగా ఉంది. మీ మదర్ అంతా మహిళామండళ్లు అంటూ ఫాస్ట్‌గా తిరుగుతుంటారు. అనురాగ్‌ని పూర్తిగా నౌకర్ల మీదే వదిలేస్తున్నారు. వాడు పాడవుతున్నాడు" మురళి గొడవ చేశాడు.

'మురళీ, నాకేం సరదానా చెప్పు, వాడ్ని అలా వదిలేయడం? నువ్వు చెప్పు నేనేం చేయాలో? ఇప్పటికే రెండేళ్లు పైగా క్రెష్‌లోనే వదిలేశాం!" నిస్సహాయంగా అంది.

'చిన్నప్పుడు సక్రమంగా పెరిగితే పిల్లలు మంచి అలవాట్లు, పద్ధతులు నేర్చుకుని పెద్దయినా అవే పాటిస్తారు. డబ్బు ఎలాగైనా సంపాదిస్తాం, కాని పిల్లాడి బుద్ధిని పెద్దయ్యాక సడన్‌గా మార్చలేం కదా?" బాధగా అన్నాడతను.

"మురళీ,పోనీ ఉద్యోగం మానేయనా?"

"నో! నీ కెరీర్‌ని తొక్కి నా కెరీర్‌ని దాని పైన నిర్మించుకోవాలనే స్వార్థపరుణ్ని కాదు నీలూ!"

"మరి ఏం చేద్దాం?" నిస్సహాయంగా అంది.

"ఆలోచిద్దాం!"

000

"డాడీ!" అనురాగ్ వచ్చి కాళ్లకు చుట్టెయ్యడంతో, గతం నుంచి తేరుకున్నాడు మురళి. వెనకే నీలూ వచ్చింది.

"అంటీ ఎలా ఉంది?" పలకరించింది శాంతని.

"డాడీ! మామ్మకి తగ్గిందా?"

"అనురాగ్, తగ్గిపోయిందిరా. రేపు వచ్చేస్తానుగా!" శాంత నవ్వుతూ అంది, మంచం మీద పడుకునే.

"మామ్మా, ఇవాళే వెళ్లిపోదాం! నువ్వు లేక పోతే ఇంట్లో నాకు చాలా బోర్‌గా ఉంది?"

శాంత అనగానే, మురళి, "చాల్లే అమ్మా! 105కి టెంపరేచరు చేరింది తెలుసా! ఎంత భయపడ్డానో, ఈ రెండు రోజులూ" బాధగా అన్నాడు

"నీ ముఖం! ప్రతీదానికి అంత అధైర్యపడితే ఎలారా? మరీ చిన్నపిల్లాడివి అవుతున్నావు రోజురోజుకి!" కొడుకు వంక ప్రేమగా చూస్తూ విసుక్కుంది, శాంత ముద్దుగా.

నీలూకు వాళ్ల అన్యోన్యత చూస్తుంటే చాలా ముచ్చట వేసింది.

000

"అమ్మా! డబ్బు లేకపోయినా పరవాలేదు, నేను సంపాదించి ఇస్తాను, చదువు రాకపోయినా పరవాలేదు, ఎలాగైనా ఎప్పుడైనా చదివించగలను. కాని మంచి సంస్కారం, వ్యక్తిత్వం లేకపోతే, ఇక మనిషిగా బతకడం ఎందుకు?"

మురళి నిర్ణయానికి స్వర్గం ఒళ్లో పడినట్టుగా అనిపించింది శాంతకు.

"ఆంటీ! అక్కడంతా పాశ్చాత్యప్రభావం చాలా ఎక్కువైపోయింది. అందుకే అనురాగ్‌ని మీకే అప్పచెపుతున్నాము" నీలూ అంది, మీదే బాధ్యత అన్నట్టుగా రెండు చేతులు పట్టుకుని!

"ఈ వయసులో దేముడు ఇంత కన్నా గొప్ప వరాన్ని నాకింత కన్నా ఏం ఇవ్వగలడు, ఈ మనవడిని తప్ప! మీకింకే బెంగా లేదు, హాయిగా వెళ్లిరండి!" చాలా ఆనందంగా నవ్వింది

"అనురాగ్, మామ్మకి జ్వరం ఇంకా తగ్గలేదు కదురా! నా దగ్గర కొన్నాళ్లు తోడుగా ఉంటువురా నాన్నా?" అనడిగింది వాడిని,

"అలాగే మామ్మా!" ఉత్సాహంగా తలూపాడు అనురాగ్.

000

"అనురాగ్, నమస్కారం చేయి!"

మామ్మ చేయి పట్టుకొని వస్తున్న అనురాగ్ ఎదురుగా వస్తున్న పెద్దాయినకు నమస్కారం పెట్టాడు.

"దీర్ఘాయుష్మాన్ భవ!" ఆయన దీవించి ముందుకు పోగాడు

"మామ్మా, ఎందుకు నమస్కారం చేయాలి? చెప్పు" అనురాగ్ అడిగాడు.

"భడవా! చిన్నప్పుడు మీ నాన్నెప్పుడూ ఇలా ప్రశ్నలు వేయలేదు. విను, పెద్దవాళ్లకు, ఆడవాళ్లకు, ముసలివాళ్లకు ఎవ్వరు కనపడినా ఇలా రెండు చేతులూ జోడించి నమస్కారం చేయాలి, అదే మన సంస్కృతి. సరేనా?"

"అలాగే మామ్మా!"

"గుళ్లోకి వెళ్లి దేముడికి దండం పెట్టుకుని వద్దాము."

"ఓ" ఉత్సాహంగా తలూపాడు.

దర్శనం అయ్యాక, "ఇదిగో ఈ చిల్లర డబ్బులు తీసుకుని మెట్ల మీద కూర్చున్న బిచ్చగాళ్లకు నెమ్మదిగా ఒంగి వాళ్ల జోలెల్లోకి వేయి. దానం ఎప్పుడూ నమ్రతగా చేయాలి?" అంది

"అలాగే మామ్మా! వేశాను!"

"అయ్యో, ఆ రోడ్డు మీద అబ్బాయికి మూర్ఛ వచ్చినట్టుంది పాపం నీ నీళ్ల బాటిల్, ఇలా ఇవ్వు. ముఖం మీద చల్లుదాం!"

"మామ్మా! నీళ్లు ముఖం పడగానే ఆ అబ్బాయి లేచాడు!" సంతోషంగా అన్నాడు అనురాగ్.

"పోన్లే, పాపం! పద పద, స్కూలుకి వేళవుతుంది!"

శాంత మనవడితో స్కూలు వైపుగా సాగిపోయింది. ఉదయిస్తున్న